







ఆలయంలో నుంచి మూకుళ్లలో దీపాలను తీసుకొస్తున్న జీయర్‌స్వామి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్, అధికారులు, అర్చకులు - శ్రీవారి ఆలయంలో వెలుగుతున్న దీపాలు - పుష్కరిణి వద్ద..

కనులపండువగా కార్తీక దీపోత్సవం

శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్తీక పౌర్ణమి దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. మొదట యోగనరసింహస్వామి ఆలయం పక్కనున్న పరిమళం అర వద్ద 80 కొత్త మూకుళ్లలో దీపాలను వెలిగించారు. వీటిని ఛత్రఛామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. తర్వాత గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారిమేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారుబావి, కల్యాణమండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహస్వామి, విష్వక్సేనుడు, చందనం అర, పరిమళం అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయకమండపం, మహాద్వారం, బేడిఆంజనేయస్వామి, వరాహస్వామిఆలయం, పుష్కరిణి వద్ద వెయ్యి నేతి జ్యోతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పౌర్ణమిగరుడసేవను రద్దు చేశారు. ఈ దీపోత్సవంలో పెద్దజీయర్‌స్వామి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అమ్మవారి ఆలయంలో..

తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి అర్చకులు, అధికారులు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ధ్వజస్తంభం, ఇతర ఆలయాలు, గర్భాలయం, పుష్కరిణి, ఆస్థాన మండపంతోపాటు పలు ప్రాంతాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, చలపతి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



హెల్మెట్ లేకుంటే ప్రాణాపాయమే

హైకోర్టు ఆదేశాలతోనైనా కనువిప్పు కలిగేనా?

మూడేళ్లలో 1000 ప్రమాదాలు.. 870 మంది మృతి

ముప్పని తెలిసినా.. ఎందరు చెప్పినా..

తలకెక్కడం లేదు

● రేణిగుంటలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ అక్టోబరు 30వ తేదీన రుయాలో అవుట్ పోస్టు విధులు నిర్వహిస్తున్నారు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఎల్‌బీ నగర్‌కు వెళుతుండగా వకుళమాత ఆలయం వద్ద వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

● చంద్రగిరి సమీపంలోని కోదండరామాపురం వద్ద జాతీయ రహదారిపై జూన్ రెండో తేదీన పెరుమాళ్లపల్లి ఎస్టీనగర్‌కు చెందిన విశ్వనాథ్, అతని బంధువు అమ్ములు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

● కరకంబాడికి చెందిన గోపాలకృష్ణ ఈ ఏడాది డిసెంబరు 8న ద్విచక్ర వాహనంపై రేణిగుంటకు వస్తున్నారు. అమర ఆస్పత్రి వద్ద రోడ్డుపై ఉన్న గుంత కనపడక పోవడంతో అందులో పడి తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతి చెందారు.

.. ఇలా రోజూ ఎన్నో ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయి. హెల్మెట్ ధరించడం వల్ల ఈ మరణాల్లో కొన్నింటినైనా నివారించగలిగే అవకాశం ఉంది.

మెదడు సున్నితమైంది. మొత్తం 22 ఎముకలు ఉంటాయి. 85 నుంచి 120 బిలియన్ల న్యూరాన్లు ఉంటాయి. దీంతో మెదడుకు చిన్న దెబ్బ తగిలినా ఆ ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది' అని న్యూరాలజీ వైద్యులు చెబుతున్నారు. అందుకే తలకు రక్షణగా హెల్మెట్ వాడాలంటున్నారు.

ద్విచక్ర వాహనదారుల నిర్లక్ష్యం.. అతివేగం.. అవతలి వాహనదారుల తప్పిదాలు.. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వందలాది మంది అసువులు బాస్తున్నారు. మృతుల సంఖ్య పెరగడానికి హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన కారణంగా పోలీసు లెక్కలు చెబుతున్నాయి. దాదాపు 90 శాతం మంది హెల్మెట్ ధరించడంలేదని తెలుస్తోంది. అదే సమయంలో హెల్మెట్ ధరించేలా ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. తామెన్ని కార్యక్రమాలు చేసినా 70 నుంచి 80 శాతం మందిలో మార్పు కనిపించడంలేదని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. 'ట్రాఫిక్ పోలీసులు మేల్కొని ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించాలి. వాహనదారులూ స్వీయ రక్షణ తీసుకోవాలి. రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షలు వెచ్చించి ద్విచక్ర వాహనాలు కొంటున్నారు. అదే రూ.వెయ్యిలోపు హెల్మెట్ కొనడానికి చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. కొన్నా ధరించడంలేదు. మెదడు సున్నితమైంది. చిన్న దెబ్బ తగిలినా ఆ ప్రభావం చాలాతీవ్రంగా ఉంటుంది' అని తాజాగా హైకోర్టు వ్యాఖ్యానించింది. దీంతో ఇకనైనా మార్పు వస్తుందా అనేది చూడాలి.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



2022, 2023 తో పోల్చుకుంటే ఈ ఏడాది ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. ఇక, క్షతగాత్రుల్లో ఎంతో మంది అంగవికలురుగా మారారు. పెద్దలకు తగిలిన 'దెబ్బ' ఆ కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై తీవ్రప్రభావం చూపాయి.

మూడేళ్లలో ద్విచక్ర వాహన ప్రమాదాల లెక్క

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	173	187 మంది	65 మంది
2023	22	44 మంది	12 మంది
2024 (నవంబరు వరకు)	1,045	435 మంది	110 మంది

ముగిసిన నీటి సంఘాల ఎన్నికలు

● 608 ఫలితాల ప్రకటన ● మరో రెండు వాయిదా

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నిక ప్రక్రియ ఆదివారం వేకువజాము వరకు సాగింది. మొత్తం 610 నీటి సంఘాలకు ఎన్నికలు జరగ్గా, శనివారం అర్ధరాత్రి సమయానికి 603 సంఘాలకు ఫలితాలు విడుదలయ్యాయి. మిగిలిన ఏడింటి పోలింగ్ ప్రక్రియ ఆదివారం వేకువజాము వరకు సాగింది. మొత్తం 608 సంఘాలకు ఎన్నికల ప్రక్రియ ముగిసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు ప్రకటించారు. ఏర్పేడు మండలం మన్నసముద్రం, తొట్టంబేడు మండలం గుండేలుగుంట నీటి సంఘాల ఎన్నిక వాయిదా పడినట్లు ఈఈ మదన్‌గోపాల్ వెల్లడించారు. మన్నసముద్రంలో బీజేపీ అభ్యర్థి కోలా ఆనంద్, టీడీపీ అభ్యర్థి రెడ్డివారి గురవారెడ్డి మధ్య సయోధ్య కుదరకపోవడం, గుండేలుగుంటలో ఇద్దరు టీడీపీ అభ్యర్థులు తానంటే తానంటూ పోటీపడటంతో వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఇక, పిచ్చాటూరు మండలం ఆరూరు కమిటీ ఉపాధ్యక్షుడు, జిల్లావ్యాప్తంగా వివిధ కమిటీలకు చెందిన 44 మంది సభ్యుల స్థానాల ఎన్నిక వాయిదా పడినట్లు మదన్‌గోపాల్ వివరించారు. 17వ తేది తర్వాత వాటికి మళ్లీ నోటిఫికేషన్ జారీచేసి, ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భద్రతతో కూడిన విద్య అందిస్తాం

● అన్ని జిల్లాల్లో బీసీ భవనాలను నిర్మిస్తాం
● బీసీ బాలికల కళాశాల హాస్టల్‌ను సందర్శించిన మంత్రి సవిత
● బీసీల ద్రోహిగా జగన్ నిలిచిపోతారని విమర్శ

తిరుపతి, డిసెంబర్15 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందిస్తామని రాష్ట్ర బీసీ, సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతి హాస్టళ్లోనూ, గురుకుల పాఠశాలల్లోనూ ఇన్వర్టర్లతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. స్పష్టంచేశారు. తిరుపతిలోని బీసీ బాలిక హాస్టల్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

అనంతరం హాస్టల్‌లోని గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, హాస్టల్ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలుపై ఆరా తీశారు. ఈ వసతి గృహం మరమ్మతులకు రూ.8లక్షలు మంజూరు చేశామని తెలిపారు. జిల్లాను ఎడ్యుకేషన్ హబ్ తయారు చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. పొట్టి శ్రీరాములు పట్టుదల, అంకుఠిత దీక్ష నేటి యువతకు ఎంతో అవసరమన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనంతగా బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లకు పైగా కేటాయించిందన్నారు. బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.25 కోట్లు కేటాయించామన్నారు. పరిశుభ్ర వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ఏ నమ్మకంతో తమ పిల్లలను బీసీ హాస్టళ్లకు పంపుతున్నారో.. అదే భరోసాతో కంటికి రెప్పలా కాపాడుతున్నామన్నారు.

ప్రతి ఇంటి నుంచీ ఓ వ్యాపార వేత్త

బీసీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచీ ఒక వ్యాపారవేత్తను రూపొందించేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో హాస్టళ్లను సందర్శించినప్పుడు తీవ్రమైన సమస్యలను గుర్తించామన్నారు. విద్యార్థులకు డైట్ బిల్లులు కూడా రాలేదని వార్డెన్లు చెప్పారు. ఈ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి డైట్ బకాయిలు చెల్లించామన్నారు. అన్ని హాస్టళ్లలోనూ నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. 2014-19లో టీడీపీ పాలనలో 70శాతం వరకు బీసీ భవనాలు పూర్తయ్యాయన్నారు. ఆ తర్వాత సీఎం అయిన జగన్.. వాటిని పట్టించుకోలేదన్నారు. అసంపూర్తి భవనాలతోపాటు కొత్త జిల్లాల్లోనూ బీసీ భవనాలను నిర్మిస్తామని మంత్రి తెలిపారు. హాస్టళ్ల నిర్వహణ, మరమ్మతులను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. చివరికి విద్యార్థుల డైట్ బిల్లులూ చెల్లించలేదన్నారు. గత ఐదేళ్లు బీసీలకు అన్యాయం చేసిన జగన్.. బీసీ ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు.ఆయన ఐదేళ్లలో చేయని అభివృద్ధిని ఐదు నెలల్లో చేసి చూపించామన్నారు. 11 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి రాని జగన్ ఇంట్లో ప్రెస్‌మీట్లు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, బీసీ వెల్ఫేర్ అధికారులు చంద్రశేఖర్, జ్యోత్స్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముక్కంటి దర్శన వేళల్లో మార్పు

శ్రీకాళహస్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం నుంచి దర్శన వేళల్లో మార్పు చేసినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెల్లవారుజామున 3గంటలకు పురవీధుల్లో జేగంట,4గంటలకు మంగళ వాయిద్యాలు, 4.15 గంటలకు గోపూజ, తిరుమంజనం, 4.30గంటలకు పల్లియర పూజ(సుప్రభాతం లేదు), తేవారం, ఉదయం 5గంటలకు సర్వదర్శనం, మొదటికాల అభిషేకం(సేవలు లేవు), 6గంటలకు రెండవ కాల అభిషేకం, 7గంటలకు పరివార దేవతా నైవేద్యం, 7.30గంటలకు గొబ్బెమ్మ ఉత్సవం, 10.30 గంటలకు మూడవ కాలాభిషేకం(ఉచ్చికాలం), సాయంత్రం 5గంటలకు ప్రదోషకాలాభిషేకం ఉంటుందని తెలియజేశారు. శుక్రవారం, శనివారం, ఆదివారం, సోమవారం రోజుల్లో రాత్రి 9గంటలకు పల్లియ పూజ, మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 9గంటలకు పల్లియర పూజల అనంతరం దర్శనం ముగింపు ఉంటుందని పేర్కొన్నారు. మూడవ కాలాభిషేకం, సాయంత్రం 4గంటలకు జరిగే మహన్యాస పూర్వక రుద్రాభిషేకానికి మాత్రం భక్తులకు టిక్కెట్లు ఇస్తామని తెలిపారు. ఇక 13వ తేదీ ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం నటరాజస్వామికి అభిషేకం, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి వేడినీళ్లతో అభిషేకం, సాయంత్రం అరికట్ల ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని సేవలు, అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

తుడా ఉత్కంఠకు తెర పడేనా..!

● ఛైర్మన్ రేసులో శంకర్ రెడ్డి?

తిరుపతి, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఛైర్మన్ పదవిపై ఉత్కంఠకు త్వరలో తెరపడనుంది. టీడీపీ, జనసేన కూటమి పార్టీల నుంచి పలువురు పోటీపడుతున్న నేపథ్యంలో ఈ పదవికి కొంతకాలంగా ప్రతిష్టంభన నెలకొంది. రాష్ట్రంలో దాదాపు అన్ని పట్టణాభివృద్ధి సంస్థలకు ఛైర్మన్లను నియమించినప్పటికీ సీఎం చంద్రబాబు నాయుడు తుడాను మాత్రం భర్తీ చేయకుండా వాయిదావేస్తూ వచ్చారు. తొలినుంచీ తుడా రేసులో ముందున్న ప్రముఖ కాంట్రాక్టర్ కె.శంకర్‌రెడ్డి పేరు దాదాపుగా ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. తొలినుంచి టీడీపీకి విధేయుడిగా ఉన్న ఆయన ఎన్నికల ముందు శ్రీకాళహస్తి అసెంబ్లీ టికెట్ ఆశించిన జాబితాలో ఉన్నారు. టీడీపీ యువనేతతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో తుడా పదవి ఆయన్నే వరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈవారంలో అధినేత నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

టీడీపీ ఆశావహుల్లో నిరాశ

పొత్తుల్లో భాగంగా తిరుపతి సీటు జనసేనకు కేటాయించడంతో టీడీపీ నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తుడాపై ఆశలు పెట్టుకున్నారు. అదేవిధంగా పార్లమెంటు అధ్యక్షుడు, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్ కూడా మరోసారి తుడా కుర్చీని ఆశిస్తున్నారు. అందుకే నెలరోజుల క్రితం రాష్ట్ర యాదవ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నరసింహ యాదవ్‌ను నియమించినప్పటికీ ఆయన ఇప్పటివరకు ప్రమాణస్వీకారం చేయలేదు. వీరు నిరాశపడే పరిస్థితి కనిపిస్తోంది.

సభ్యత్వ నమోదులో వెనుకంజ అందుకేనా?

టీడీపీ నేతలు ఆశించిన పదవులు రాకపోవడం, వచ్చిన పదవుల్లోనూ కొందరు అసంతృప్తిగా ఉండడం, భవిష్యత్తులో పదవులు వస్తాయో? రావో అన్న గ్యారెంటీ లేకపోవడం వంటి కారణాలవల్లే టీడీపీ సభ్యత్వ నమోదులో తిరుపతి వెనుకబడివుందని అంటున్నారు. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 50వేల సభ్యత్వ నమోదు చేయాలని పార్టీ సూచించింది. ఇప్పటివరకు 20వేలు కూడా దాటని పరిస్థితి నెలకొంది. 175 నియోజకవర్గాల్లో చివరి పాతిక నియోజకవర్గాల్లో తిరుపతి ఉండడంపై పార్టీ అధిష్ఠానం అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.



అమరజీవికి ఘన నివాళి

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడు పొట్టి శ్రీరాములు అని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆదివారం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించారు. నేటితరానికి ఆయన ఆదర్శప్రాయులన్నారు. డీఆర్వో నరసింహులు, సహాయ బీసీ సంక్షేమాధికారిణి జ్యోత్స్న, బీసీ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం, ఆదివారం.. వరుస సెలవులతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 27వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,015మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,575మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,617మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,093, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 364మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 262మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 81మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 23,397 అమ్ముడైనట్లు అధికారులు వివరించారు.

శ్రీవారి సేవలో ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ చక్రధారి శరణ్

తిరుమల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ప్రభుత్వ విప్ బొమ్మిడి నారాయణ, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీదా రవిచంద్ర, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, సినీ నిర్మాత అశ్వినిదత్, కర్ణాటక మంత్రి బోసే రాజు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.



రాంగోపాల్‌రెడ్డి, బీదా రవిచంద్ర , దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అశ్వినిదత్‌బోసేరాజు

బేడి ఆంజనేయస్వామికి ప్రత్యేకాభిషేకం



తిరుమల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందున్న బేడి ఆంజనేయస్వామికి ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం జరిగింది. కార్తీకమాసం చివరి ఆదివారం సందర్భంగా ఏటా ఆలయంలో ప్రత్యేక అభిషేకం చేయడం టీటీడీకి ఆనవాయితీ. ఆలయంలో మూల మూర్తికి ఉదయం విశేషంగా అభిషేకం నిర్వ హించారు. శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ, అధికా రులు, అర్చకులు పాల్గొన్నారు.

తిరుమలనగర్‌లో సమస్యలు పదిలం



గుంతలు తేలిన తిరుమలనగర్‌కు వెళ్లేమార్గం



నివాసాల వెనుక మురుగునీటి ప్రవాహం



రాళ్లు తేలిన రహదారి

తిరుపతి అర్బన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పేరేమో గొప్ప.. ఊరేమో దిబ్బ అనడానికి మంగళంలోని తిరుమలనగర్ చక్కటి నిదర్శనం. ఇది మంగళం-2, తిరుమలనగర్ పంచాయతీల పరిధిలో ఉంది. ఫలితంగా ఇక్కడ అభివృద్ధి విషయంలో రెండు పంచాయతీల పాలకులు, అధికారుల మధ్య సమన్వయం లోపించింది. దీంతో ప్రజలు సమస్యలతో జీవనం సాగిస్తున్నారు. చాలా ఏళ్లుగా రోడ్ల మరమ్మతులు చేపట్టలేదు. మురుగునీటి కాలువలు నిర్మించలేదు. కొండ నుంచి వచ్చే వర్షపునీటి కాలువలు విస్తరించలేదు. ఎగువ కాలనీల నుంచి మురుగునీరు నివాసాల వెనుక ప్రవహిస్తూ రోడ్డుపక్కనున్న ఖాళీ స్థలంలోకి చేరుతోంది. రెండు పంచాయతీల వారు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ప్రజల సమస్యలను గాలికొదిలేశారు. తమ గోడు వినేదెవరంటూ వాపోతున్నారు.



మురుగునీటి కాలువలు లేకపోవడంతో ప్రధాన రహదారికి పక్కనే నిల్వ ఉంటున్న మురుగునీరు

వైభవంగా కార్తీక దీపోత్సవం



దీపాలు తీసుకెళుతున్న అర్చకులు, అధికారులు

చంద్రగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. అనంతరం 10 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లను కల్యాణ మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు ఊంజల్ సేవను నిర్వహించారు. కార్తీక దీపోత్సవం సందర్భంగా సాయంత్రం ఆలయ ప్రదక్షణగా దీపాలను తీసుకొచ్చి ధ్వజ స్తంభం వద్ద దీపారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రి చార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా..!

ఎమ్మెల్యే పులివర్తి నాని



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని..ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం చంద్రగిరిలో నూతన ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని.. గత వైసీపీ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీరం చేశారన్నారు. భవన నిర్మాణం శరవేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ఎ.రంగంపేట నుంచి మూలపల్లె వరకు గ్రామాలను కుప్పం తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, ఇన్‌చార్జి ఈవోఆర్డీ శ్రీనివాసులు, ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు సురేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, గౌస్ బాషా, కొండూరు ప్రవీణ్‌రాయల్, బాలకృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మినీ బస్టాండుకు స్థల పరిశీలన

చంద్రగిరిలో ఆర్టీసీ మినీ బస్టాండు ఏర్పాటుకు ఎమ్మెల్యే పులివర్తి నాని ఆర్టీసీ అధికారులతో కలిసి ఆదివారం స్థల పరిశీలన చేశారు. ఎన్నికల్లో పులివర్తి నాని ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా శ్రీనివాసమంగాపురం మార్గంలోని స్వర్ణ ముఖినది సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. ఆర్టీసీ అధికారులు అనుకూలంగా ఉందని తెలపడంతో వెంటనే బస్టాండు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

భాకరాపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తొగటవీర క్షత్రియ కులానికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఊన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ పంచాయతీ శ్రీ కొల్లాపురం ఆలయం వద్ద ఆదివారం కార్తీక మాస వన సమా రాధన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా శ్రీ కొల్లాపురమ్మ, చౌడేశ్వరి దేవి అమ్మవార్లకు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం తొగటవీర క్షత్రియ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, రెడ్డప్ప, వెంకటరత్నం, మదనమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి



భాకరాపేట సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ రామ్ సింగ్

భాకరాపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటింగ్ కమిషన్ చైర్మన్ రామ్ సింగ్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట సబ్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భాకరాపేట, నెల్లుట్లవారిపల్లె సబ్‌స్టేషన్‌లలో ప్రస్తుతం ఉన్న 5 ఎంవీఏలకు అదనంగా మరో 5 ఎంవీఏలను వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు అమర్చాలన్నారు. అలాగే ఎర్రావారిపాళెంలో నాలుగు సబ్‌స్టేషన్‌లలో 5 ఎంవీఏలను అదనంగా అమర్చాలని ఆదేశించారు. వినియోగదారులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్రనాయుడు, ఈఈ వాసు రెడ్డి, డీఈ జీవన్ కుమార్ రెడ్డి, ఈఈలు రవికుమార్, అమర్‌బాబు, నాగరాజు, చిన్నగొట్టిగల్లు ఏఈ రియాజ్ అహ్మద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా త్యాగదుర్గం మునస్వామి



కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ మునస్వామి

భాకరాపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీభక్త సిద్ధి అభయాంజనేయస్వామి ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా రిటైర్డు టీటీడీ డిప్యూటీ ఈవో త్యాగదుర్గం మునస్వామి(మౌని) ఎన్నికయ్యారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీ చిన్నగాండ్లపల్లెలోని వెలసిన జైసీతారామ్ శ్రీభక్త సిద్ధి అభయాంజనేయ స్వామి సేవాసమాజం (ట్రస్టు) అధ్యక్షుడు సీపీ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం నూతన ఉత్సవ కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎం.శ్రీకాంత్‌నాయుడు, ఎస్. మల్లికార్జున, గౌరవ సలహాదారులుగా కె.సురేంద్రరావు, కార్యదర్శిగా కె.సురేంద్ర, కోశాధికారిగా కె.చేతన, ఉపాధ్యక్షులుగా జి.పద్మావతమ్మ, బి.లక్ష్మీపతి ఆచారి, ఉప కార్యదర్శులుగా డి.వెంకటాచారి, జి.గురున్నాథం, జె.విశ్వనాథన్, సహకార్యదర్శులుగా జి.హరినాథరెడ్డి, కె.మల్లికార్జునాచారి, కె.మోహనాచారి, ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

నీటి సంఘం అధ్యక్షుడికి సన్మానం



అధ్యక్షులు, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు కొడవకంటి అర్జున్‌నాయుడు, ఉపాధ్యక్షుడు త్యాగరాజును రాయలచెరువు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు చేకూరి ఆనందనాయుడు ఘనంగా సన్మానించారు. ఆదివారం మిట్టూరు గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. రాయలచెరువు అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని, నీటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సి.జనార్దన్ చౌదరి, వెంకటప్రసాద్, భూపాల్‌నాయుడు, రేణుచౌదరి, గరుడాద్రినాయుడు, ధనంజయులు, వెంకటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో రైతుపై దాడి



చికిత్స పొందుతున్న చెంగల్రాయులు

చంద్రగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి వారపు సంతలో రైతుపై గుత్తేదారుడు దాడి చేశాడు. బాధితుడు కథనం మేరకు .. రామచంద్రాపురం మండలం బొప్పరాజుపల్లెకు చెందిన రైతు ఆవుల చెంగల్రాయులు, భార్య అరుణ కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. ఆదివారం చంద్రగిరి వారపు సంత కావడంతో భార్యభర్తలు కూరగాయాలను సంతకు తీసుకొచ్చారు. సాయంత్రం వారపు సంతలో గుత్తేదారుడైన నాగరాజు గేటు వసూలు చేస్తుండగా ఆవుల చెంగల్రాయుల వద్దకు వచ్చి రూ.500 చెల్లించాలని డిమాండు చేశాడు. తాను ప్రతివారం రూ.200 మాత్రమే చెల్లిస్తున్నాని, అదే చెల్లిస్తానని చెప్పడంతో నాగరాజు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. అంతలో చెంగల్రాయులు తన సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తుండగా గమనించిన నాగరాజు.. చెంగల్రాయులపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో చెంగల్రాయులు కింద పడిపోవడంతో స్థానికులు చంద్రగిరి ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడి వద్ద ఫిర్యాదును స్వీకరించి కేసును విచారిస్తున్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కాసల కోనయ్య

తిరుచానూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో తమ హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం వ్యవస్థాపకులు, జాతీయ చైర్మన్ కాసల కోనయ్య అన్నారు. తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో ఆదివారం మానవ హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి తన జీవన విధానాన్ని పెంపొందించు కునేందుకు తనకున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బీవీ గణేష్, హేమసుందరం, కొండేటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఉత్సవాల్లో కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్



పూజలు నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్

రామచంద్రాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సి.రామాపురంలోని శ్రీసిద్ధేశ్వర తీర్థం (బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమం)లో జరుగుతున్న అష్టలక్ష్మి ఉత్సవాల్లో కేంద్ర చేనేత శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఆశ్రమానికి చేరుకున్న కేంద్రమంత్రికి ఆశ్రమ నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రార్థన మందిరంలో నిర్వహిస్తున్న అష్టలక్ష్మి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మూడు గంటల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ పాలక మండలి సభ్యులు భానుప్రకాష్ పాల్గొన్నారు.

పల్లె కన్నీటిని ఆవిష్కరించే నాటకం 'పడమటి గాలి'

● నేడు తిరుపతి మహతిలో ప్రదర్శన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు నేల మీద అత్యంత ప్రజాదరణ పొందిన నాటకం ప్రదర్శనకు తిరుపతి వేదిక అవుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటలకు మహతిలో 'పడమటి గాలి' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. రైతుల కష్టాలు కళ్లకు కట్టినట్లుండే ఈ నాటకంలో పదుల సంఖ్యలో పాత్రలుంటాయి. సినిమాలు ఓటీటీలో సైతం వెల్లువగా మారిన ఈ రోజుల్లోనూ 'పడమటి గాలి' నాటకాన్ని ఎక్కడ ప్రదర్శించినా జనం పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. పాటిబండ్ల ఆనందరావు రాసిన ఈ నాటకాన్ని తొలుత 1999 డిసెంబరు 27న ఒంగోలులో ప్రదర్శించారు. నాలుగు గంటల నిడివి కలిగిన ఈ నాటకం వందలాది ప్రదర్శనలు పూర్తి చేసుకుంది. పదుల సంఖ్యలో పాత్రలు ఉంటాయి. ఒక మల్టీనేషనల్ కంపెనీ నిర్మాణానికి భూమి సేకరణ అంశం ప్రధానంగా నాటకం నడుస్తుంది. మోతుబరి రైతు అంజయ్య, మాయోడు అనే దళారీ, భూమిని వదులుకోవడానికి అంగీకరించని రైతు రాంకోటి, ఆయన కొడుకు రాంపండు, కోడలు హేమ, భార్య లచ్చిందేవి.. ప్రధాన పాత్రలుగా నాటకం సాగుతుంది. మాయోడు పాత్రను మన జిల్లాకు చెందిన రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య పోషించి రక్తి కట్టించారు. ఆయనే ఈ నాటకం నిడివిని రెండున్నర గంటలకు తగ్గించారు. తిరుపతిలో మూడవసారి 'పడమటి గాలి' నాటక ప్రదర్శన తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో చేపడుతున్నారు.

మంత్రి సవితకు సన్మానం



తిరుపతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పర్యటనకు వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం ఆదివారం సత్కరించారు. ఆయనతో పాటు టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీసీ నాయకులు కృష్ణ యాదవ్, మునిబాలకుమార్, భజన్‌త్రీ మల్లికార్జున్, రమేష్ బాబు, శంకర్, అమర్నాథ్, చంద్రమౌళి, సుబ్రమణ్యం, మునిశంకర్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో కార్తీక దీపోత్సవం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పలు ఆలయాల్లో సోమవారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆయూష్, ధన్వంతరి హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు విష్ణుస్వామి

గంగాధరనెల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆయూష్, ధన్వంతరి హోమ పూజలు, స్వామి, అమ్మవార్లకు అభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కె.ఎస్. వాసుతో పాటు కుటుంబసభ్యులు తరఫున మాజీ ట్రస్టీ శ్రీధర్ జ్ఞాపకార్థం ఆలయానికి ఆండాల్ విగ్రహాన్ని, తిరుపతికి చెందిన రామదొరై అభిషేకం పూజలకోసం రెండు కొత్త అండాలను బహూకరించారు. మాజీ సుమిత్రా శ్రీధర్, మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి చర్యలు



వసతిగృహ సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో పాడిపరిశ్రమ ఏర్పాటు, అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. వెటర్నరీ వర్సిటీ ప్రాంగణంలోని పశుగణాభివృద్ధి సంస్థ (ఏపీఎల్‌డీఏ) శిక్షణ కేంద్రంలో రూ.70 లక్షలతో నిర్మించిన వసతిగృహ సముదాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెటర్నరీ వైద్యులు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే నివాళి అర్పించారు. అనంతరం ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఏడీ డాక్టర్ రెడ్డివరప్రసాద్, డీఏహెచ్‌వో డాక్టర్ రవికుమార్, డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ గోవిందయ్య, ఏవోలు, వెటర్నరీ వైద్యులు, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కూటమి పార్టీ నేతలు శ్రీధర్‌నాయుడు, నాగూరు శ్రీనివాసులు, కాయం వెంకటేష్, దామినేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీరింగ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రవీంద్ర



తిరుపతి అర్బన్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం 47వ వార్షికోత్సవం, సర్వసభ్య సమావేశం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కె.రవీంద్ర(కర్నూలు), కార్యదర్శిగా మహంతి(శ్రీకాకుళం), ట్రెజరర్‌గా వెంకట్‌రెడ్డి(విజయవాడ), గౌరవాధ్యక్షుడిగా షేక్‌రియాజ్‌అహ్మద్, సలహాదారుగా జి.హనుమంతరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అన్నం రాంబాబు నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగ సంఘం మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, ప్రస్తుత చైర్మన్ శివారెడ్డి, కార్యదర్శి పురుషోత్తమనాయుడు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి



మాట్లాడుతున్న ప్రదీప్ కొండపర్తి

తిరుపతి(విద్య), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలని సినీనటుడు, వ్యక్తిత్వ వికాస శిక్షకుడు ప్రదీప్ కొండపర్తి అన్నారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో బాలాజీ నర్సింగ్ కాలేజీ, వినాయక నర్సింగ్ స్కూల్, ప్రవీణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారా మెడికల్ సైన్స్ సంయుక్తంగా ఆదివారం సాయంత్రం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించాయి. ముఖ్య అతిథిగా హాజరైన ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంపైనే దృష్టి సారించాలన్నారు. నాణ్యతతో కూడిన స్నేహం చిరకాలం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వై.ప్రవీణ్, రవీంద్రారెడ్డి, శంకరయ్య, గిరిజామోహన్, నవీన్‌కుమార్, గీత, సునీల్‌రెడ్డి, అఖిల్, హారిక తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న వెంకటరత్నం నాయుడు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 15 (ఆంధ్రప్రదేశ్): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడు అన్నారు. ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఆదివారం రాస్ ఉద్యోగుల వార్షిక క్రీడలను ఆయన ప్రారంభించారు. విధి నిర్వహణలో మహిళా ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతారని, వారికి ఆటవిడుపు కోసం రాస్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. మహిళలకు మ్యూజికల్‌చైర్స్, షాట్‌పుట్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించినట్లు రాస్ సంయుక్త కార్యదర్శి మమత తెలిపారు. డైరెక్టర్ వి.నాగరాజు, అధికారులు బాలాజీరెడ్డి, రవి, వెంకటేష్, తపోవని, భార్గవి, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల అమరజీవి

● సంగీత విభావరి ముగింపు సభలో వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల వెంకటేశ్వరరావు అమరజీవి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మహతి కళా క్షేత్రంలో చేపట్టిన సంగీత విభావరి ఆదివారం ముగిసింది. నటుడు ప్రదీప్ మాట్లాడుతూ ఒక దశలో యువతను ఉర్రూతలూగించిన గొంతు ఘంటసాలదని కొనియాడారు. అలాంటి గొప్ప గాయకుడు తెలుగు నేలపై పుట్టడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ సంగీతం వినడం, పాడటం మంచి అలవాటన్నారు. తిరుపతి ఫిలిం సొసైటీ ఏటా ఇలాంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండటం అభినందనీయమన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ఘంటసాల పాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. యోధ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ యోగేష్ మాట్లాడుతూ.. సంగీతం మనిషిని పరిపూర్ణుడిని చేస్తుందన్నారు. చదలవాడ సుమలత మాట్లాడుతూ సంగీత ప్రపంచానికి ఘంటసాల ఒక వరమని అభిప్రాయపడ్డారు. ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ సుమ మధుబాల మాట్లాడుతూ ఈ తరం సంగీతం పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి శాంతా వాణి, గుల్జార్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.



సుమలతను సన్మానిస్తున్న రవినాయుడు, సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాలరెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి ప్రసాదరావు, ఉపాధ్యక్షులు బుజ్జిబాబునాయుడు, మధుసూదనరెడ్డి, సుబ్రమణ్యం, భాస్కర్, అనసూయ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చలి కాలం



చలి పులికి తట్టుకోలేక వెచ్చదనం కోసం రెండు శునక కూనలు అట్టపెట్టలో ఒకటికొకటి హత్తుకుని తలదాచుకుంటే.. మరోవైపు అట్టముక్కలు సేకరించే వ్యక్తి పక్కనే ఉన్న వైన్ షాపులో పూటుగా మందేసి, ఆ మత్తులో చలీ లేదు గిలీలేదు అన్నట్టు రోడ్డుపక్కనే పడకేశాడు. తిరుపతి తిలక్ రోడ్డులోని శ్రీదేవి కాంప్లెక్స్ సమీపంలోనే ఈ రెండు 'వి'చిత్రాలు' కనిపించాయి.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి





ఆటోనగర్ వద్ద వంతెన కింద నుంచి బయటకొస్తున్న అండర్ డ్రైనేజీ నీరు - అన్నాచెరువు నుంచి దిగువకు పారుతున్న మురుగు నీరు

చేపల కోసం మనుషుల ప్రాణాలతో చెలగాటం

నగర డ్రైనేజీ నీరు చెరువులకు మళ్లింపు - కలుషితమవుతున్న భూగర్భ జలాలు



కలుషిత నీటితో మొరవపారుతున్న చెన్నాయిగుంట చెరువు

తిరుపతిఅర్బన్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): చేపల కోసం కొందరు మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నగర డ్రైనేజీని చెరువులకు మళ్లించి భూగర్భ జలాలు కలుషితమయ్యేలా చేస్తున్నారు. తద్వారా చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల లోపు నీరు రంగు మారిపోయాయి. వేరే గత్యంతర లేని ప్రజలు వాటిని తాగి అనారోగ్యం పాలవుతున్నారు. సాధారణంగా నగరం నుంచి వెలువడే డ్రైనేజీ నీరు ఎక్కువగా స్వర్ణముఖి నదిలో, తూకివాకం దగ్గర కార్పొరేషన్ ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి కేంద్రానికి తరలించాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో చేపల చెరువులను దక్కించుకున్న వ్యక్తులు నిబంధనలను తుంగలో తొక్కారు. రేణిగుంట రోడ్డు, ఆటోనగర్ వద్ద వంతెన కింద పైపులను ధ్వంసం చేసి, అండర్ డ్రైనేజీని సైడు కాలువకు మళ్లించేశారు. అక్కడి నుంచి రైల్వేట్రాక్ కింద ప్రవేశించి అన్నాచెరువులోకి నీరు చేరేలా ఏర్పాట్లు చేశారు. అది నిండి మిగిలిన చెరువుల మీదుగా చెన్నాయిగుంట చెరువులో కలుస్తున్నాయి. కొర్లగుంట, కట్టకిందపల్లె, పాతమంగళం నుంచి మరో రెండు కాలువల ద్వారా డ్రైనేజీ నీరు ఈ చెరువుకు చేరుతున్నాయి. దీంతో ఆ చెరువు మండు వేసవిలోనూ మొరవ పారుతూ ఉంటుంది. అన్నాచెరువు, మంచినీళ్లగుంట, చింతమాకుల గుంట, మంగళంచెరువు, శెట్టిపల్లెచెరువు, చక్రాలబండచెరువులు కూడా పూర్తిగా కలుషితమైపోయాయి. కలుషిత నీటితో దుర్వాసన వెదజల్లుతున్నాయి. గుర్రపుడెక్కలతో నిండిపోయున్నాయి. చుట్టుపక్కల వారు అభ్యంతరం వ్యక్తం చేసినా ప్రయోజనం లేకపోయింది. కలుషిత నీటి కారణంగా తాజాగా చేపల చెరువులు పాడుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శెట్టిపల్లె చెరువు దక్కించుకున్న కాంట్రాక్టరు డ్రైనేజీ నీరు రాకుండా చర్యలు తీసుకుంటేనే డబ్బు చెల్లిస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమ్మవారి సేవలో సుబుదేంద్రతీర్థ



తిరుచానూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం మంత్రాలయం రాఘవేంద్ర మఠాధిపతి సుబుదేంద్రతీర్థ తన శిష్య బృందంతో దర్శించుకున్నారు. ఆలయాధికారులు, అర్చకులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి, తర్వాత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అమ్మవారి శేషవస్త్రంతో ఆయన్ను ఆలయ అర్చకులు సత్కరించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అర్చకుడు బాబుస్వామి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

నృత్యం సమ్మోహనం



తిరుచానూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్యం సమ్మోహనంగా సాగింది. శ్రీగురుకృప, శ్రీగురుదత్త కళానిలయం ఆధ్వర్యంలో కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు వంశీకృష్ణ, ధరణీకృష్ణ, సంప్రీతిక, స్ఫూర్తి, మోక్ష, వినూత్న, రుష్మితశ్రీ, నయనిక తదితరులు శ్రీవిఘ్నరాజంభజే, వచ్చేను అలమేలు మంగ, నగుమోము, దేవిస్తుతి వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

ఏపీ ట్రెజరీ అండ్ అకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



తిరుపతి(జీవకోన), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కరకంబాడి రోడ్డులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏపీ ట్రెజరీ అండ్ అకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర సహాధ్యక్షుడిగా కే.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కరీముల్లా, డి.నరేష్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా డి.శ్రీనివాసరావు, కోశాధికారిగా యుగంధర్, మిగిలిన జిల్లాలకు ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ ఏపీ ఖజానా శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకుని, పదోన్నతుల కల్పనకు కృషి చేస్తామన్నారు.

స్పీడ్ రోలర్ స్కేటింగ్‌లో మెరిసిన తిరుపతి చిన్నారులు

బంగారు, రజితం, కాంస్య పతకాలు కైవసం



చిన్నారులు పావనపర్ణిక, శ్రీవత్సాంకితలను అభినందిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి (క్రీడలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్పీడ్ రోలర్ స్కేటింగ్ పోటీలలో తిరుపతి చిన్నారులు బంగారు, రజితం, కాంస్యం పతకాలు కైవసం చేసుకున్నారు. 62వ రోలర్ స్కేటింగ్ ఫెడరేజేషన్ ఆఫ్ ఇండియా(ఆర్‌ఎస్‌ఎఫ్‌ఐ) జాతీయస్థాయి పోటీలు మైసూరులో ఈనెల 5నుంచి 15వ తేదీ వరకు నిర్వహించారు. ఏపీ నుంచి 58మంది ప్రాతినిథ్యం వహించాగా తిరుపతి నుంచి 11మంది ఉన్నారు. చిగురువాడకు చెందిన వి.పావనపర్ణిక స్వర్ణ, రజిత పతకాలు సాధించింది. దామినేడుకు చెందిన శ్రీవత్సాంకిత బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుంది. ఆదివారం ఉదయం స్థానిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో వారిని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు, జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్‌లు సన్మానించారు. ఏషియన్‌గేమ్స్‌లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

తైక్వాండో శిక్షకుడికి క్రీడారత్నం అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న గోపీనాయుడు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ సీనియర్ అసిస్టెంట్, విద్యాసంస్థల తైక్వాండో కోచ్ కొమ్మినేని గోపీనాయుడికి క్రీడారత్నం అవార్డు దక్కింది. బెంగళూరు వేదికగా ఆదివారం జేపీ పార్కు కప్ 2024 ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. గోపీనాయుడు కోచ్‌గా అనేక మంది క్రీడాకారులను తయారు చేస్తున్న విషయాన్ని గుర్తించి, పోటీల ఆర్గనైజర్ పెంచలయ్య ఈ అవార్డు ప్రదానం చేశారు. శాలువకప్పి సత్కరించారు.

కేంద్రమంత్రికి ఘన స్వాగతం



మంత్రిని సత్కరిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథరెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు ఆదివారం తిరుపతిలో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి తదితరులు పద్మావతి గెస్ట్‌హౌస్‌లో కేంద్ర మంత్రిని కలిసి దుశ్శాలువతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి మల్లారపు రవి ప్రసాద్, తూర్పు మండల ప్రధాన కార్యదర్శి తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, యువమోర్చా జిల్లా నాయకులు రాజశేఖరరెడ్డి, టీడీపీ నేత చిత్తరపు హనుమంతరావు ఉన్నారు.

పటేల్‌కు ఘన నివాళి



తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత తొలి ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని టాటా నగర్‌లో ఆదివారం చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, శ్రద్ధాంజలి ఘటించారు. పటేల్ దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, కట్టమంచి చంద్రబాబు యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి మల్లారపు రవి ప్రసాద్, తూర్పు మండల ప్రధాన కార్యదర్శి తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, యువ మోర్చా జిల్లా నాయకులు రాజశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు చిత్రపు హనుమంతరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

తిరుపతి(జీవకోన), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించే జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తిరుపతి శాఖ అధ్యక్షుడు మార్కొండారెడ్డి కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఆ రోజున సీనియర్ పెన్షనర్లను సన్మానించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి


ముగ్గురికి తీవ్ర గాయాలు



మృతి చెందిన గోవిందమ్మ - గాయపడిన దేవ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ఆదివారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒక మహిళ మృతి చెందింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అలిపిరి సీఐ లోకేష్‌బాబు, తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. రామచంద్రాపురం మండలం బుట్టిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన దేవ ద్విచక్ర వాహనంలో తిమ్మినాయుడు పాళెం నుంచి వస్తున్నాడు. రెడ్డి భవనం వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కరకంబాడికి చెందిన యశ్వంత్, సాయిలు స్కూటీలో వేగంగా వచ్చి ఢీకొట్టారు. దేవకు తీవ్ర, యశ్వంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని తిరుపతి రుయాకు తరలించారు. దేవ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిత్తూరు-నాయుడుపేట జాతీయ రహదారిలోని వకుళమాత ఆలయం వద్ద చంద్రగిరి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం వెనుక వైపు కూర్చున్న నగరికి చెందిన గోవిందమ్మ (35) అక్కడికక్కడే మృతి చెందింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న ఆమె బంధువుకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులూ, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,962

తలనీలాలు సమర్పించినవారు : 30,645

ఎడ్యుకేషన్ ఫేర్‌కు విశేష స్పందన



జ్యోతి ప్రజ్వలనతో ఎడ్యుకేషన్ ఫేర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

తిరుపతి (విద్య), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఫౌండేషన్ ఫర్ యూత్ అడ్వాన్స్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం రాజ్‌పార్క్ హోటల్లో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫేర్‌కు విశేష స్పందన లభించింది. టీఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్‌రాయల్, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ఎడ్యుకేషన్ ఫేర్‌ను ప్రారంభించారు. అపోలో, గీతం, జైన్, వినాయక మిషన్, ఎస్‌ఆర్‌ఎం, సెంచూరియన్, దయానంద సాగర్ తదితర 20కి పైగా విశ్వవిద్యాలయాలు ఈ ఫేర్‌లో పాల్గొన్నాయి. 300 మంది విద్యార్థులు హాజరై తమకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకున్నారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని ఈస్ట్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. పూతలపట్టు మండలం వావిల్‌తోటకు చెందిన బుజ్జి, నెల్లూరు జిల్లా నాగోలు గ్రామానికి చెందిన శారద, బాలాయపల్లికి చెందిన పి.సుబ్రహ్మణ్యంతో కలసి కొన్ని రోజులు భవానీనగర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. కోస్తా ప్రాంతాల నుంచి అమ్మాయిలను పిలిపించి గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం నడిపిస్తున్నారు. ఈస్ట్ ఇన్‌చార్జి సీఐ రామకృష్ణకు సమాచారం రావడంతో ఎస్‌ఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. సుబ్రహ్మణ్యం, బుజ్జి, శారదను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.వెయ్యి స్వాధీనం చేసుకున్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



ఎస్పీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

తిరుపతి (నేర విభాగం), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవిగా ఖ్యాతి గడించిన పొట్టి శ్రీరాములు ఆదర్శనీయుడని, ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అందరికీ మంచి భవిష్యత్తు కోసం కృషి చేసిన ఆయన త్యాగం అందరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, రిజర్వు ఏఎస్పీ శ్రీనివాసులు, ఎస్పీ సీఐ శ్రీనివాసులు, ఎంటీవో, ఆర్ఐలు పాల్గొన్నారు.



శాప్ ఆధ్వర్యంలో...

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి, పుష్పాంజలి ఘటించారు. అమరజీవి త్యాగాలను కొనియాడారు. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, కోచ్‌లు లక్ష్మీకరుణ, శశిధర్, ఇందుజ, చక్రవర్తి, సాయిసుమతి, ప్రేమ్‌నాథ్, స్కేటింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

తిరుపతి అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య తిరుపతి సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, ప్రతినిధులు రుయా ఆస్పత్రి కూడలిలోని పొట్టిశ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలను సమర్పించిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములని కొనియాడారు.



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో..

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రుయా ఆస్పత్రి ఎదురుగా ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథరెడ్డి పుష్పాంజలి ఘటించారు. మల్లారపు రవి, ప్రసాద్, సుబ్రమణ్యంరెడ్డి, హనుమంతరావు, సుబ్రమణ్యంయాదవ్ పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్



తిరుమల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): కేంద్ర చేనేత, జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి నైవేద్య విరామ సమయంలో ఆలయంలోకి వెళ్లిన కేంద్రమంత్రికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఆలయ డిప్యూటీఈవో లోకనాథం ఉన్నారు.

కేరళ పట్ల వివక్ష వీడాలి



సదస్సులో మాట్లాడుతున్న నర్సింగరావు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష వీడాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు కోరారు. స్థానిక యోగివేమన విజ్ఞాన భవన్‌లో ఆదివారం సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేరళ సంఘీభావ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వామపక్షాలు పాలిస్తున్న కేరళ రాష్ట్రానికి నిధుల కేటాయించడంలో వివక్ష చూపడం అన్యాయమన్నారు. కేరళ ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్న వామపక్ష ప్రభుత్వాలను అభినందించాల్సిన కేంద్రం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. వయనాడు జిల్లాలో వరదలు వచ్చిన సమయంలోనూ సాయం చేయకపోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. కేరళలో లౌకికత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తున్నది వామపక్ష పార్టీలే అని, అలాంటి ప్రభుత్వాన్ని కూల్చడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు ప్రయత్నించడం తగదని అన్నారు. సదస్సులో నాయకులు బాలసుబ్రమణ్యం, వి.నాగరాజు, కందారపు మురళి, పి.హేమలత పాల్గొన్నారు.

జిల్లా వడ్డెర సంఘం నూతన కార్యవర్గం



సంఘీభావం తెలుపుతున్న రాష్ట్ర, జిల్లా వడ్డెర నాయకులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జిల్లా వడ్డెర సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీ వడ్డెర సంఘం అధ్యక్షుడు దేవల మురళి, రాయలసీమ అధ్యక్షుడు దేవల శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా బత్తల ఆదినారాయణ, అధ్యక్షుడిగా గుంజు మదన్‌మోహన్, ఉపాధ్యక్షులుగా టి.శ్రీనివాసులు, మేముల నాగరాజు, కోటకొండ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా దేవల రమణ, కోశాధికారిగా బండి సుబ్రహ్మణ్యం, అధికార ప్రతినిధిగా బత్తుల రవి, చల్లా రమణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా బత్తుల వాసులు, వేములబాల, సోంపల్లి ద్రాణమణి, కార్యదర్శులుగా బండి మునిశంకర, సోంపల్లి జ్ఞానేంద్రి, వేముల బాబు, జ్యోతిబాబు, పల్లపు మహేంద్ర ఎన్నికయ్యారు. కూటమి ప్రభుత్వం వడ్డెరలకు పెద్ద పీట వేసిందని ఏపీ వడ్డెర సంఘం అధ్యక్షుడు, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవల మురళి అన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా అధ్యక్షులు సింగపూర్ రవి, నాయకులు వేముల జగన్నాధం,నాగరాజు, హరిబాబు, దేవల కుప్పయ్య, దేవల సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వైద్యసేవలకు దూరమౌతున్న డక్కిలి ఆస్పత్రి

- ఆరు నెలల్లో ఆరు కాన్పులే
- అత్యవసర కేసులైనా సరే ఇతర ప్రాంతాలకు రెఫర్
- 30 పడకల నుంచి పీహెచ్‌సీ స్థాయికి తగ్గించిన వైసీపీ
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు


డక్కిలిలోని ప్రభుత్వాస్పత్రి

డక్కిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డక్కిలిలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు సన్నగిల్లుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతమైన డక్కిలి మండలవాసులకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి 30 పడకల ఆస్పత్రి ప్రారంభించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ ఆస్పత్రి బాగోగులు పట్టించుకోకపోవడమే కాక పీహెచ్‌సీ స్థాయికి తగ్గించింది. అదేవిధంగా ఆస్పత్రిలో సిబ్బందినీ తగ్గించేసింది. దీంతో వైద్యసేవలకు పేదలు దూరమౌతూ వస్తున్నాయి. తప్పని పరిస్థితుల్లో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. డక్కిలి పీహెచ్‌సీలో రోజూ 150 నుంచి 200 వరకు ఓపీ నమోదవుతుంది. అలాగే రోజుకు పది నుంచి 20 మంది వరకు గర్భిణులు వైద్యసేవలు పొందేందుకు వస్తుంటారు. కానీ కాన్పులు మాత్రం చేయడంలేదు. గడిచిన ఆరు నెలల్లో కేవలం ఆరు కాన్పులు మాత్రమే జరిగాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మండలంలో రాత్రి వేళల్లో గర్భిణులకు నొప్పులు వచ్చి ఆస్పత్రికి వైద్యులెవ్వరూ అందుబాటులో ఉండటం లేదు. దీంతో గర్భిణులు వ్యయప్రయాసల కోర్చి వెంకటగిరి లేదా రాపూరు, గూడూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ పనిచేసే వైద్యులు అందరూ వెంకటగిరి, రాపూరు, గూడూరు ప్రాంతాల్లో నివాసం ఉంటుండగా వైద్య సిబ్బంది మాత్రం నెల్లూరు పట్టణంలో నివాసాలు ఏర్పరుచుకొన్నారు. ఇక మండలంలో 14 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నప్పటికీ కాన్పుల కేసులేవీ డక్కిలి పీహెచ్‌సీకి రావడం లేదు. ఇక్కడి డీసీఎస్ హరిత గత రెండేళ్ల నుంచి తిరుపతి డీఎం అండ్ హెచ్‌వో ఆఫీసుకు డిప్యుటేషన్‌పై వెల్లడంతో ఇక్కడి పీహెచ్‌సీని పట్టించుకొనేవారే లేరని స్థానికులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతధికారులు చొరవ తీసుకొని డక్కిలి పీహెచ్‌సీలో వైద్య సేవలు మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

కేశవరంలో కార్డెన్ సెర్చ్

కోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ జరిగింది. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎస్‌ఐలు పవన్‌కుమార్, నాగబాబు, బలరామయ్య ఆధ్వర్యంలో కేశవరం గ్రామంలో కవాతు నిర్వహించారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. దొంగతనాలకు పాల్పడితే జరిగే పరిణామాలను స్థానికులకు వివరించారు.


పోలీసులకు సూచనలిస్తున్న సీఐ హుస్సేన్‌బాషా

దుమ్ము రేపుతూ... రోడ్లను ఛిద్రం చేస్తున్నాయ్!
టిప్పర్లను అడ్డుకుని చిల్లమానుచేను గ్రామస్తుల నిరసన


టిప్పర్లను నిలిపివేసి నిరసన తెలుపుతున్న చిల్లమానుచేను గ్రామస్తులు

ఓజిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామమంతా దుమ్ముతో నిండిపోతోంది... సమీపంలోని నిమ్మ తోటలు ఎండిపోతున్నాయి... పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు... అడుగడుగునా గుంతలు ఏర్పడి రోడ్డు ఛిద్రమైపోతోంది... అంటూ ఓజిలి మండలంలోని చిల్లమానుచేను గ్రామస్తులు ఆదివారం గ్రామం మీదుగా వెళుతున్న టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చిల్లమానుచేనుకు సమీపంలో ఉన్న క్వారీ నుంచి రోజూ టన్నుల కొద్ది మెటల్ తరలిస్తున్న టిప్పర్ల వల్ల పెద్దపరియ వరకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైపోయిందన్నారు. గుంతల దారిలో ప్రయాణం చేయలేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతన్నారని చెప్పారు. టిప్పర్ల రాకపోకల వల్ల దుమ్ము లేచి ఇళ్లలోకి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఎంతో మంది శ్వాసకోశ సమస్యలతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, క్వారీ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు చిల్లమానుచేను గ్రామానికి చేరుకుని స్థానికులకు సర్దిచెప్పి టిప్పర్ల రాకపోకలను కొనసాగించారు.

రైలు ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం


వినయ్‌కుమార్‌కు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు, పక్కన టీడీపీ నాయకులు రమేష్, కిషోర్ తదితరులు

సూళ్లూరుపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకొన్న సూళ్లూరుపేటకు చెందిన ఆర్.వినయ్ కుమార్‌కు కృత్రియ అవయవాల కోసం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు రూ.46 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో వినయ్‌కుమార్‌కు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంగళంపాడులో పారిశుధ్య పనులు

సూళ్లూరుపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని మంగళంపాడులో వీధులన్నీ మురుగుమయంగా మారాయి. సర్పంచు రుక్మిణి, టీడీపీ నాయకుడు సతీష్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో మురుగునీటి తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. విషజ్వరాలు, అంటు వ్యాధుల ప్రబలకుండా బ్లీచింగ్‌తో పాటు సున్నం చల్లి వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షుడుశేషాద్రి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఆశా వర్కర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వానికి విశేష ఆదరణ


తిన్నెలపూడిలో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న సుష్మారెడ్డి

కోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని జిల్లా తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిన్నెలపూడిలో సభ్యత్వ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీలో సభ్యత్వం ఉన్న వారికి బీమా సౌకర్యం ఉందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్నా సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన ప్రజలు ఆసక్తి పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు చూపుతున్నారని చెప్పారు. ఒక్క తిన్నెలపూడి పోలింగ్ బూత్ 196 పరిధిలో 550 మంది స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వం తీసుకొన్నారని తెలిపారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గూడూరు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు.

దివ్యాంగులకు కోడి గుడ్లు, కూరగాయల పంపిణీ


దివ్యాంగులకు కోడిగుడ్లు, కూరగాయాలు అందజేస్తున్న జేవీవీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

గూడూరు అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీసీ పార్కులో గోపాల్ దాతృత్వంతో ఆదివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులకు కోడి గుడ్లు, కూరగాయలను అందజేశారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు జేవీవీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అంతేకాకుండా పేదలకు చేయూతనందించేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, చెంచు నారాయణ, విజయ్‌బాబు, ఇబ్రహీం, సుధీర్, సుమన్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల అందజేత


నిత్యవసరాలు అందజేస్తున్న సింహపురిరెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు

గూడూరు అర్బన్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దన్ రెడ్డి, రోహిణి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందన షాపింగ్‌మాల్ ప్రారంభం


షాపింగ్ మాల్‌లో నగలను చూపిస్తున్న రీతువర్మ

సూళ్లూరుపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సినీనటి రీతువర్మ సందడి చేశారు. సూళ్లూరుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన చందన షాపింగ్ మాల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వళన చేశారు. అనంతరం రీతువర్మ షాపింగ్ మాల్‌లో ఉన్న బంగారు ఆభరణాలు, దుస్తుల డిజైన్లను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను సూళ్లూరుపేటకు వచ్చి షాపింగ్‌మాల్ ప్రారంభించడం సంతోషంగా ఉందని, ఇక్కడ ప్రజలు ఎంతో అప్యాయత చూపిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ద నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్న సూళ్లూరుపేటలో చందన లాంటి షాపింగ్ మాల్ ప్రారంభం కావడం వల్ల ఎందరో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. తమ సంస్థ నాణ్యతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని షాపింగ్ మాల్ నిర్వాహకులు సంతోష్, గణేష్ తెలిపారు. కార్యక్రమంలో పెంచలకోన ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, వీహెచ్‌పీ నాయకులు

గూడూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న డిమాండ్‌తో రాష్ట్రం వ్యాప్తంగా హిందూవులందరూ వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం సభ నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సభను అందరం కలిసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళీరెడ్డి, రమణయ్య, హరిబాబు, మల్లికార్జున, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా ఇంజనీర్ల గౌరవ అధ్యక్షుడిగా రియాజ్ అహ్మద్


రియాజ్ అహ్మద్‌ను అభినందిస్తున్న అశోక్‌బాబు

గూడూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా గూడూరుకు చెందిన రియాజ్ అహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతిలో నిర్వహించిన పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం సర్వసభ్య సమావేశంలో ఈయనను ఎన్నుకోవడం జరిగింది. రియాజ్ అహ్మద్‌కు ఎమ్మెల్సీ అశోక్‌బాబు, సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి రియాజ్ అహ్మద్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

కోటమ్మ ఆలయంలో లలితాహోమం


లలితహోమం చేస్తున్న ఆలయ ధర్మకర్తలు

కోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మ ఆలయంలో మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం లలితా హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో భక్తులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ లలితాహోమాన్ని నిర్వహించారు.

తైక్వాండో శిక్షకుడికి క్రీడారత్నం అవార్డు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ సీనియర్ అసిస్టెంట్, విద్యాసంస్థల తైక్వాండో కోచ్ కొమ్మినేని గోపీనాయుడికి క్రీడారత్నం అవార్డు దక్కింది. బెంగళూరు వేదికగా ఆదివారం జేపీ పార్కు కప్ 2024 ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. గోపీనాయుడు కోచ్‌గా అనేక మంది క్రీడాకారులను తయారు చేస్తున్న విషయాన్ని గుర్తించి, పోటీల ఆర్గనైజర్ పెంచలయ్య ఈ అవార్డు ప్రదానం చేశారు.


అవార్డు స్వీకరిస్తున్న గోపీనాయుడు

జాతీయస్థాయి కర్రసాము పోటీల్లో 8మందికి బంగారు పతకాలు


కర్రసాములో పతకాలు సాధించిన క్రీడాకారులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కర్రసాము చాంపియన్ షిప్-2024 పోటీలను డిసెంబరు 13, 14 తేదీల్లో నెల్లూరులో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించినట్లు కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, కోచ్ ఉయ్యాల పవన్ ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో 380 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 23మంది నాయుడుపేట క్రీడాకారులు పాల్గొనగా 8మంది బంగారు పతకాలు, ఆరుగురు వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు.

హరినాథరెడ్డి మృతి తీరని లోటు: నెలవల


హరినాథరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు

పెళ్లకూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి ఎన్నో ఏళ్లుగా విశేష సేవలందించిన నందిమాల గ్రామానికి మాజీ సర్పంచ, టీడీపీ సీనియర్ నాయకుడు నల్లాడి హరినాథరెడ్డి(85) లేని లోటు తీర్చ లేనిదని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. హరినాథరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలో ఓ ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందారు. ఆదివారం నందిమాలలో అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డితో కలిసి నెలవల సుబ్రహ్మణ్యం నందిమాల గ్రామానికి చేరుకుని హరినాథరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరినాథరెడ్డి భార్య పరమేశ్వరమ్మ, కుమారులు సుధాకర్ రెడ్డి, శివకృష్ణారెడ్డిని ఓదార్చారు. హరినాథ్‌రెడ్డితో తనకున్న సాన్నిహిత్యాన్ని నెలవల గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు దామెర ప్రసాద్ నాయుడు, నేలవల్లి సిద్యులయ్య నాయుడు, పీవీ కృష్ణారెడ్డి, మదన్‌మోహన్‌నాయుడు, తాళ్ల యుగంధర్ గౌడ్, వెంకటయ్య, మల్లిరెడ్డి, మునివర్ధన్‌రెడ్డి, గుంటపూడి రమణయ్య తదితరులు ఉన్నారు.

కాశీవిశ్వేశ్వర ఆలయంలో గోపూజ


ఆలయం వద్ద గోపూజ చేస్తున్న నిర్వాహకులు

తడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్నమాంబట్టులో వెలిసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఆదివారం తమిళ కార్తీక మాస పౌర్ణమి సందర్భంగా స్వామివార్లకు విశేష పూజలు జరిగాయి. గోపూజ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు డాక్టర్ మల్లికార్జున, అముద దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆర్ఎం ఉమామహేశ్వర రావు, విష్ణుప్రియ, తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి, అనిల్‌రెడ్డి, చండీ రాణెమ్మ, దేవేందర్‌రెడ్డి, మోహన్ రావు, ముద్దుకృష్ణయ్య పాల్గొన్నారు.

అన్నదానం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక బొప్పాపురం రాధాకృష్ణ మందిరంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో నిర్వహకులు ఏపీపీ ప్రకృతి కుమార్ అన్నదానం చేశారు. స్వామి వివేకానంద యువసైన్యం సభ్యులు మన్నూరు అరవింద్, చిన్నమద్దేరి గోపీనాథ్, వీరభద్రయ్య, గణేష్, శ్రీనివాసాచారి, మధుకర్ పాల్గొన్నారు.

అయిదేళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన
యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెళ్లకూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని ఓ దళితవాడలో అయిదేళ్ల చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై ఆదివారం పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. బాలిక తల్లిదండ్రులు నెలబల్లి ఉపాధి నిమిత్తం వేరే చోట ఉంటూ సెలవు దినాలలో స్వగ్రామానికి వస్తుంటారు. కుమార్తెతో పాటు 11 ఏళ్ల కుమారుడిని తమ ఇంట్లోనే ఉంచి.. చిన్నారుల అమ్మమ్మను తోడుగా పెట్టారు. శుక్రవారం వీరి అమ్మమ్మ పక్కింటికి వెళ్లగా.. బాలిక ఒక్కటే ఇంట్లోఉంది. ఆ ఇంటికి తరచూ వచ్చే నెలబల్లి సుధాకర్ అనే యువకుడు ఒంటరిగా ఉన్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. అదే సమయంలో ఆమె అమ్మమ్మ ఇంటికి రావడంతో పరారయ్యాడు. ఏడుస్తున్న బాలికను అడగ్గా.. వచ్చీరాని మాటలతో అతడి అసభ్యకర ప్రవర్తన గురించి చెప్పింది. శనివారం రాత్రి ఇంటికి వచ్చిన బాలిక తల్లిదండ్రులకు ఆమె చెప్పడంతో.. వారు ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, స్థానిక ఎస్‌ఐ నాగరాజుతో కలసి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా.. వేధించినా.. కఠిన చర్యలు తప్పవని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఇలాంటి ఘటనలపై ఇప్పటికే అన్ని పాఠశాలలతో పాటు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అఘాత్యాలకు, నేరాలకు పాల్పడితే ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సమన్వయంతో ముందుకెళ్తాం: బీజేపీ


బీజేపీ అభ్యర్థులను అభినందిస్తున్న ఎద్దల నరేంద్రరెడ్డి


పెళ్లకూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమిలోని కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన సమన్వంతో పనిచేస్తూ ముందుకెళ్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ధన్యవాదాలు అన్నారు. మండలంలోని పాలచ్చూరు, పెన్నేపల్లి సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన బీజేపీ మద్దతుదారులు కట్టంరెడ్డి రాజారెడ్డి, గోగుతొట్టి సుబ్బులయ్యను అభినందించారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపీకి రెండు సాగునీటి సంఘాలు కేటాయించినందుకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని ఎన్నికల్లో సమన్వంతో ముందుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

కోట, నాయుడుపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని పొట్టి శ్రీరాములు క్యాంస విగ్రహానికి కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన ఆర్యవైశ్యసంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కనమర్లపూడి సుబ్రమణి, తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్, కార్యదర్శి గాధంశెట్టి నాగరాజు, ఆర్యవైశ్య యువజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి సోల్లేటి చంద్రశేఖర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కులను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావు

గూడూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం దళితులకు ప్రసాదించిన హక్కులను కాపాడే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల చట్టాలను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు సమిష్టిగా పోరాటాలు చేపట్టి హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగభూషణం, నాగరాజన్, మురళి, బలరాం, కాలయ్య, ప్రభాకర్, తులసీ రాజన్, శశికుమార్, మస్తానయ్య, నాగేంద్ర, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సుబుదేంద్రతీర్థ

తిరుచానూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం మంత్రాలయం రాఘవేంద్ర మఠాధిపతి సుబుదేంద్ర తీర్థ తన శిష్య బృందంతో దర్శించుకున్నారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి, తర్వాత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అమ్మవారి శేషవస్త్రంతో ఆయన్ను ఆలయ అర్చకులు సత్కరించారు.

పుత్తూరు వార్తలు

నీటి సంఘాలతో సాగు కష్టాలకు చెక్

- రైతు కష్టాలు.. రైతులే పరిష్కరించుకునేలా నీటి సంఘాలు
- ఎన్నికైన సభ్యులకు అభినందనల వెల్లువ




కేబీఆర్ పురం సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్, గూళూరు సాగు నీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులతో గంజి మాధవయ్య

పుత్తూరు అర్బన్, డిసెంబర్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో అమల్లోకి తీసుకొచ్చిన నీటి సంఘాలతో పుత్తూరు పరిధిలోని సాగు కష్టాలకు చెక్ పడనుంది. ఏడు చెరువుల పరిధిలో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులకు ఆదివారం అభినందనలు వెల్లువెత్తాయి. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య సభ్యులను సన్మానించారు. రైతుల నమ్మకాన్ని వమ్ముచేయక రైతాంగం అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. గూలూరు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మందడి వెంకట్రాయులు, కొండేటి క్రిష్ణయ్య నేసనూరు సాగు నీటి సంఘానికి శ్యామల, మణి, కేబీఆర్ పురం సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా పి.శివయ్య, సుబ్రమణ్యంరాజు, పుత్తూరు చెరువుకు అధ్యక్ష, ఉపాధ్యాక్షులుగా డీసీ.శ్రీనివాసులు, నైనారి వినోద్, చిన్నరాజకుప్పం చెరవుకు కోటి, హరి, వీరప్పరెడ్డి పాలెం చెరవుకు పరుశురాం నాయుడు, అన్బలగన్, నందిమంగళం చెరవుకు కుశలకుమార్, మునిరత్నంనాయుడులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సాగులో 2 వేల ఎకరాలు

పుత్తూరు పరిధిలోని నీటి సంఘాల పరిధిలో దాదాపు 2 వేల ఎకరాల సాగు భూమి ఉంది. గూలూరు చెరువు కింద 600 ఎకరాలు సాగులో ఉండగా, మిగిలిన ఆరు చెరువుల పరిధిలో 1,400 ఎకరాలలో రైతులు పంటలు పండిస్తున్నారు. వరి, వేరుశనగ, మామిడి, పొద్దుతిరుగుడు, ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నారు. ఈ ఆయకట్టుకు సంబంధించిన కాలువలు పొంగినా, గట్లకు గండ్లు పడినా నీటి సంఘాలు రైతులకు అండగా నిలవనున్నాయి. ఏ ఆయకట్టుకు ఎంత నీరు వదలాలో సంఘాల చూసుకుని రైతులందరికీ వెన్నుదన్నుగా ఉండనున్నాయి.

పొలాల్లోనే వరదనీరు..సాగని పంటలు



పొలాల్లో నిలిచిఉన్న వర్షం నీరు

పుత్తూరు టౌన్, డిసెంబర్ 15(ఆంధ్రజ్యోతి): అసలే అదను దాటి పోతున్న ఆందోళనలో ఉంటే వరుస తుపానులతో రైతన్నలు వణికిపోతు న్నారు. సాధారణంగా రబీ సాగు నవంబరు 15 నుంచి డిసెంబరు 15 లోపు ముగించాల్సి ఉంది. ఈ సీజన్‌లో తూర్పు మండలాలలో వరి, వేరుశనగ, పొద్దు తిరుగుడు, నువ్వులు వంటి పంటలు విస్తారంగా సాగుచేస్తుంటారు. అయితే ఈ ఏడాది వర్షాల కారణంతో నేటికీ పొలాల్లో వర్షపు నిలిచిపోవడంతో రైతులు విత్తనాలు విత్తలేకపోతున్నారు. విత్తనాలు సిద్ధంగా ఉన్నా వర్షం కారణంగా రబీ సాగు చేసుకోలేకున్నారు. ఆలస్యంగా సాగుచేస్తే దిగుబడి తగ్గి నష్టాలపాలవుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా దీపోత్సవం



దీపాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, అధికారులు

వడమాలపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా అప్పలాయ గుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉభయదేవేరులతో స్వామివారిని విశేషంగా అలంకరించి ఆలయ ఆవరణలో వేంచేపు చేశారు. పుణ్యాహవచనం, లక్ష్మీపూజ, విశేష నివేదన చేశారు. అనంతరం దీపాలను ఊరేగింపుగా పుష్కరిణి, అంజనేయ స్వామి ఆలయానికి తీసుకెళ్లి వెలిగించారు. సూపరింటెండెంట్ శ్రీవాణి, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

నేడు పెద్దపాండూరు చెరువు వేలం

వరదయ్యపాళెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాండూరు చెరువును సోమవారం వేలంవేయనున్నట్లు సర్పంచ్ కవిత, కార్యదర్శి తిరుమల తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలని కోరారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



రేణిగుంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పర్యటనకు విచ్చేసిన కేంద్ర చేనేత శాఖ మంత్రి గిరి రాజ్‌సింగ్‌కు ఘనస్వాగతం లభించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న కేంద్ర మంత్రికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఆయనను ఘనంగా సత్కరించారు.

చలో కడపకు తరలిన ముస్లింలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం జరిగిన భారీ బహిరంగసభకు శ్రీకాళహస్తి నుంచి భారీఎత్తున ముస్లింలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మతపెద్ద ముక్తి నయీమ్, షాకీరాలీ, ఖాదర్ బాషా, షఫీ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ఏర్పేడు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆదివారం సీఐ జయచంద్ర పలువురు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎక్కడా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్గొనకూడదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్రమంత్రిని కలిసిన గుత్తి త్యాగరాజు



కే వీ బీ పురం, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో ఆదివారం కేంద్ర చేనేతశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను బీజేపీ నాయకుడు గుత్తి త్యాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. సత్కరించి జ్ఞాపికగా చరఖాను అందజేశారు. హ్యాండ్‌లూం బోర్డును పునఃప్రారంభించాలని, వర్క్‌షెడ్లు మంజూరు చేయాలని, చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.

మంత్రి నారా లోకేశ్‌కు కోట వినుత సన్మానం



శ్రీకాళహస్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను ఆదివారం జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఉండవల్లిలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, కూటమి సమన్వయంపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కోట చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కోతకు గురైన చిన్నాయగుంట రోడ్డు

- ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నాయగుంట గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షాలకు కోతకు గురికావడంతో ప్రయాణానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జంబుగోళం రోడ్డు నుంచి కోనేటిమిట్ట మీదగా చిన్నాయ్యగుంటకు రెండు కిలోమీటర్ల రోడ్డు ఉంది. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పైనుంచి వరద రావడంతో రోడ్డు చాలా వరకు కోతకు గురైంది. గుంతల్లోనే ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పల్లె కన్నీటిని ఆవిష్కరించే నాటకం పడమటిగాలి

నేడు తిరుపతి మహతిలో ప్రదర్శన



పడమటి గాలి నాటకంలోని ఓ సన్నివేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు నేల మీద అత్యంత ప్రజాదరణ పొందిన నాటకం ప్రదర్శనకు తిరుపతి వేదిక అవుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటలకు మహతిలో 'పడమటి గాలి' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. రైతుల కష్టాలు కళ్లకు కట్టినట్లుండే ఈ నాటకంలో పదుల సంఖ్యలో పాత్రలుంటాయి. సినిమాలు ఓటీటీలో సైతం వెల్లువగా మారిన ఈ రోజుల్లోనూ 'పడమటి గాలి' నాటకాన్ని ఎక్కడ ప్రదర్శించినా జనం పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. పాటిబండ్ల ఆనందరావు రాసిన ఈ నాటకాన్ని తొలుత 1999 డిసెంబరు 27న ఒంగోలులో ప్రదర్శించారు. నాలుగు గంటల నిడివి కల్గిన ఈ నాటకం వందలాది ప్రదర్శనలు పూర్తి చేసుకుంది. పదుల సంఖ్యలో పాత్రలు ఉంటాయి. ఒక మల్టీనేషనల్ కంపెనీ నిర్మాణానికి భూమి సేకరణ అంశం ప్రధానంగా నాటకం నడుస్తుంది. మోతుబరి రైతు అంజయ్య, మాయోడు అనే దళారీ, భూమిని వదులుకోవడానికి అంగీకరించని రైతు రాంకోటి, ఆయన కొడుకు రాంపండు, కోడలు హేమ, భార్య లచ్చిందేవి.. ప్రధాన పాత్రలుగా నాటకం సాగుతుంది. మాయోడు పాత్రను మన జిల్లాకు చెందిన రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య పోషించి రక్తి కట్టించారు. ఆయనే ఈ నాటకం నిడివిని రెండున్నర గంటలకు తగ్గించారు. తిరుపతిలో మూడవసారి 'పడమటి గాలి' నాటక ప్రదర్శన తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో చేపడుతున్నారు.

పిల్లర్లకే పరిమితమైన సచివాలయం

- విలేజ్ క్లినిక్‌లో నడుస్తున్న సచివాలయం
- దుస్థితికి చేరుకున్న పాత సచివాలయ భవనం




పిల్లర్ల వద్ద ఆగిపోయిన సచివాలయ భవన నిర్మాణ పనులు, ప్రస్తుతం సచివాలయం నిర్వహిస్తున్న విలేజ్ క్లినిక్

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలత్తూరు సచివాలయానికి శాశ్వత భవనం లేకపోవడంతో విలేజ్ క్లినిక్‌లో నడుస్తోంది. గ్రామంలో పాత పంచాయతీ భవనం చాలా చిన్నది. ఆ చిన్న గది కూడా దుస్థితికి చేరుకుంది. దీంతో సచివాలయ భవనం కోసం ప్రాథమిక పాఠశాల దగ్గర ఒక స్థలం ఎంపిక చేశారు. భవ నానికి పిల్లర్లు కూడా వేశారు. గ్రామంలో ఓవ్యక్తి ఈ స్థలం తనదంటూ కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకోవడంతో నిర్మాణ పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. చేసేది సిబ్బంది పాత భవనంలోనే విధులు కొనసాగించే వారు. వారు ఇబ్బందులు గుర్తించిన ఎంపీడీవో పట్టాభి గిరిజన కాలనీలో ఉన్న విలేజ్ క్లినిక్‌లో సచివాలయాన్ని మార్పు చేశారు. ఓ పక్క సచివాలయ సిబ్బంది, మరో పక్క వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు. మధ్యలోనే ఆగిపోయిన భవన నిర్మాణం పూర్తిచేసేందుకు న్యాయపరమైన చిక్కులు తొలగించి పనులు పూర్తిచేయాలని, లేనిపక్షంలో గ్రామంలో మరోచోట సచివాలయ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోవర్ధనపురం కాజ్‌వేపై గుంతల పూడ్చివేత



వరదయ్యపాళెం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలో గోవర్ధనపురం వద్ద ఉన్న కాజ్‌వే ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతింది. వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజల కష్టాలను గుర్తించిన టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ఆదివారం కాజ్‌వేపై ట్రాక్టర్‌తో గులక మట్టిని వేసి గుంతలను పూడ్చించాడు. ఎక్స్‌కవేటర్ సాయంతో చదును చేయించారు. తన సొంతఖర్చుతో ఈ పనులు చేయించారు. హెడ్‌కానిస్టేబుల్ సాయిబాబు ఈ సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూశారు. దీంతో ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘం అధ్యక్షుడిగా ఆర్డీ నారాయణ



నాగలాపురం, డిసెంబరు, 15 (ఆంధ్ర జ్యోతి): నాగలాపురం మండల వర్తక సంఘం అధ్యక్షుడిగా ఆర్డీ నారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం వర్తక సంఘం కళ్యాణ మండపంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా సోమసుందరం, ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం, జుగ్గరాజ్ జైన్, బాబురెడ్డి, కార్యదర్శిగా హరిక్రిష్ణ, సంయుక్త కార్యదర్శిగా సంతోష్, క్యాషియర్‌గా రమేష్, కార్య నిర్వాహకులుగా మురుగేషన్ ఎన్నికయ్యారు.

పొట్టి శ్రీరాముల త్యాగఫలితమే తెలుగు రాష్ట్రం



పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాముల త్యాగఫలితమే తెలుగువారికి రాష్ట్రం ఏర్పడిందని శ్రీకాళహస్తీశ్వ రాలయ పాలకమండలి మాజీ సభ్యులు, ఆర్యవైశ్యులు, టీడీపీ నాయకుడు వాకిచర్ల గుర్రప్పశెట్టి అన్నారు. ఆదివారం పట్టణంలోని బజారువీధిలో గల కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు అన్నదానం చేశారు.

అడవిశంకరాపురం అధ్యక్షుడికి ఎమ్మెల్యే సన్మానం



పిచ్చాటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలంలోని అడవి శంకరాపురం చెరువు ఆయకట్టు అధ్యక్షుడిగా ఎన్నికైన పద్దురాజును సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆదివారం ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలో సాగు నీటి సంఘ అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా, టీసీ మెంబర్లుగా ఎన్నికైన కూటమినేతల కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌క్వార్టర్స్ ప్రాంతంలో వరాహాల బెడద



శ్రీకాళహస్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని పోలీస్‌క్వార్టర్స్ ప్రాంతంలో పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎదురుగా పోలీస్ క్వార్టర్స్ ప్రాంతం ఉంది. ఈ క్వార్టర్స్ నిరుప యోగంగా మారాయి. క్వార్టర్స్ పక్కనే చర్మాల మండీ వీధిలో పెద్దసంఖ్యలో నివాస గృహాలు ఉన్నాయి. కొందరు పోలీస్‌క్వార్టర్స్ ప్రాంగణంలో పందులను విడిచిపెట్టారు. ఇవి చుట్టుపక్కల నివాసగృహాల్లోకి చొరబడుతూ పిల్లలు, వృద్ధులు, మహిళలను హడలెత్తిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం ఓ మహిళ ఇంట్లోకి పందులు చొరబడ్డాయి. ఈ ప్రాంతంలో వ్యాధులు విజృంభిస్తున్నాయని పందుల సంచారాన్ని అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తైక్వాండో శిక్షకుడికి క్రీడారత్నం అవార్డు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ సీనియర్ అసిస్టెంట్, విద్యాసంస్థల తైక్వాండో కోచ్ కొమ్మినేని గోపీనాయుడికి క్రీడారత్నం అవార్డు దక్కింది. బెంగళూరు వేదికగా ఆదివారం జేపీ పార్కు కప్ 2024 ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. గోపీనాయుడు కోచ్‌గా అనేక మంది క్రీడాకారులను తయారు చేస్తున్న విషయాన్ని గుర్తించి, పోటీల ఆర్గనైజర్ పెంచలయ్య ఈ అవార్డు ప్రదానం చేశారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు

తిరుపతి (నేర విభాగం): అమరజీవిగా ఖ్యాతి గడించిన పొట్టి శ్రీరాములు ఆదర్శనీయుడని, ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

మట్టిరోడ్డుకే పరిమితమైన గోపాలకృష్ణాపురం మార్గం



కేవీబీపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలకృష్ణాపురం గిరిజనకాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితికి చేరుకుంది. 50ఏళ్లకు పైగా ఉన్న ఈ కాలనీ ఇప్పటి వరకు సీసీరోడ్డుకు నోచుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు మార్గం సరిగ్గా లేక అంబులెన్సు చేరుకోలేక నిండు గర్భిణి రోడ్డుపైనే ప్రసవించింది. వైద్యసౌకర్యం అందక శిశువు మృతి చెందింది. అప్పట్లోనే వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసి సిమెంటు రోడ్డు మంజూరు చేసింది. అయినా అది ప్రతిపాదనలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం అయినా స్పందించి ఈ రోడ్డుకు మోక్షం కల్పిస్తుందని గిరిజనులు ఎదురు చూస్తున్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశమైన ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే 30శాతం ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ కోరారు. ఆదివారం పట్టణంలోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు యాప్‌ల బాధల నుంచి విముక్తి కల్పించి కేవలం బోధనకే పరిమితం చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థుల పరీక్షలకు సంబంధించి వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారాలు, సెలవురోజుల్లోనూ ప్రత్యేక తరగతులు కొనసాగించడంతో వారు ఇబ్బందులు పడతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ, పీఆర్సీ పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, వెంకటముని, వెంకటాద్రి మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం ఆగినా.. తరలని నీరు



కేవీబీపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేవీబీ పురం, కళత్తూరు దళితవాడల్లో వర్షాలు తగ్గినా ఇంకా ఇళ్ల మధ్య చేరిన నీరు అలాగే నిల్వ ఉంది. కేవలం డ్రైనేజీ వ్యవస్థ లేకపోవ డంతో ఆ నీరు ఎటూ పోయే మార్గం లేక ఈ దుస్థితి దాపురించింది. నీరు నిల్వ చేరడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.